సాక్షి అనకాపల్లి

గురువారం । 2 । నవంబర్ । 2023



బెయిల్‌పై సంబరాలా? 10లో

ఆపరేషన్ కోసం చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇస్తే సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదమని మంత్రి అమర్‌నాథ్ అన్నారు.



ఆకట్టుకున్న కళాకృతులు

బాలల దినోత్సవం సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లాస్థాయిలో నిర్వహించిన కళాకృతుల పోటీలు అలరించాయి. 10లో



బయో కెమిస్ట్రీ విభాగం కళకళ

విశాఖ: ఏయూ బయో కెమిస్ట్రీ విభాగంలో మౌలిక సదుపాయాలను వీసీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రారంభించారు.

న్యూస్‌రీల్

ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి లేబొరేటరీని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలో అన్ని రకాల వైద్యం అందుబాటులో ఉండాలని మంత్రి అమర్‌నాథ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ ఆవరణలో ఆయన బుధవారం కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ లేబొరేటరీని ఎంపీ సత్యవతితో కలిసి ప్రారంభించారు. ఈ లేబొరేటరీతో ఆధునిక వైద్యపరీక్షలు సులభంగా చేయవచ్చని మంత్రికి వైద్యులు వివరించారు. సీటీ స్కాన్ ఏర్పాటుకు అవసరమైన గది మరమ్మతులకు సహకారం అందించాలని వైద్యాధికారులు మంత్రిని కోరారు.

పోలీసు ధ్రువపత్రం ఫోర్జరీ

- ఇద్దరిపై కేసు నమోదు

చోడవరం రూరల్ : పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌ను ఫోర్జరీ చేసిన నేరానికి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన బొంతు సంతోష్ విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో కాంట్రాక్టర్ వద్ద దిన వేతన కూలీగా పనిచేస్తున్నాడు. గతంలో ఆయన కాంట్రాక్టర్‌కు అందచేసిన పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్‌కు కాలం చెల్లడంతో చోడవరంలోని రాంబాబు మాస్టారు కాంప్లెక్సులో ఉన్న రాజేష్ ఈ సేవ కేంద్రంలో నకిలీ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ చేయించి కంపెనీకి సమర్పించాడు. అయితే ఆ సర్టిఫికెట్ నకిలీదని వారి విచారణలో రుజువు కావడంతో కంపెనీ సబ్ కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు నిందితుడు బొంతు సంతోష్, అతనికి సహకరించిన ఈ సేవ కేంద్రం రాజేష్‌లపై కేసు నమోదు చేశారు.

రూ.2 కోట్ల పొదుపు సొమ్ము స్వాహా

- పరారీలో కీలక పాత్రధారి వీవోఏ మంగతాయారు
- సత్యనారాయణపురంలో అధికారుల విచారణ

అనకాపల్లి రూరల్: ప్రభుత్వం పొదుపు సంఘాలకిస్తున్న రుణాలను అక్రమార్కులు స్వాహా చేసిన వ్యవహారం అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో వెలుగు చూసింది. రూ.2 కోట్లను డూప్లికేట్ గ్రూపుల పేరుతో స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. బుధవారం సత్యనారాయణపురం కల్యాణమండపంలో బినామీ రుణాల వ్యవహారంపై డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, యలమంచిలి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ విచారణ చేపట్టారు. వీవోఏ కండిపిల్లి మంగతాయారు ఈ వ్యవహారాన్ని నడిపినట్టు విచారణలో పలువురు పొదుపు సంఘాల మహిళలు వాంగ్మూలం ఇచ్చారు. అనకాపల్లి బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు గ్రూపుల పేరుతో రూ.85 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడాలో 7 గ్రూపుల పేరున రూ.82 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.35.20 లక్షలు రుణాల రూపంలో పక్కదారి పట్టినట్టు విచారణలో వెల్లడైంది. మంగతాయారు 15 రోజుల నుంచి పరారీలో ఉందని పలువురు బాధితులు అధికారులకు తెలిపారు. కలెక్టర్‌కు సమగ్ర నివేదిక పంపిస్తామని డీఆర్‌డీఏ పీడీ తెలిపారు.

సగర్వంగా మోగిద్దాం

సామాజిక జయభేరి



మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్‌లో సభా ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ కటౌట్లు

- నేడు మాడుగులలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర
- కె.కోటపాడు నుంచి ప్రారంభం
- పార్టీ శ్రేణుల్లో ఉరకలెత్తుతున్న ఉత్సాహం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర గురువారం మాడుగుల నియోజకవర్గంలో జరగనుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడంతోపాటు గత టీడీపీ ప్రభుత్వం పేద ప్రజలను మోసం చేసిన తీరును ఎండగట్టడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. ఉత్తరాంధ్రలో ఇప్పటికే 5 నియోజకవర్గాల్లో విజయవంతంగా సాధికార యాత్ర సాగింది. గురువారం మాడుగుల నియోజకవర్గంలో ఆరో రోజు యాత్ర జరగనుంది. ఉదయం 10 గంటలకు కె.కోటపాడులో వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతిలకు స్వాగతం పలకనున్నారు. అనంతరం కె.కోటపాడు శివాలయం సమీపంలో నిర్వహించే మీడియా సమావేశంలో వారు మాట్లాడతారు. అక్కడ నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర బైక్ ర్యాలీతో ప్రారంభం కానుంది. మధ్యలో కె.కోటపాడులో రూ.5.6 లక్షలతో 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన సీహెచ్‌సీని, ఎ.కోడూరులోని ప్రభుత్వ హైస్కూల్లో పూర్తయిన 'నాడు - నేడు' అభివృద్ధి పనులను మంత్రుల బృందం పరిశీలిస్తుంది. అక్కడ నుంచి యాత్ర దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామం చందన్ వ్యాలీ మీదుగా మాడుగుల ఘాట్ రోడ్ వద్ద బహిరంగ సభా స్థలికి చేరుకుంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి బహిరంగ సభ జరుగుతుంది. డిప్యూటీ సీఎం, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో సామాజిక సాధికార యాత్ర సాగనుంది.

సాధికార యాత్రతో జోష్

సామాజిక సాధికార యాత్రతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోంది. యాత్రకు గ్రామాల్లో స్వాగతం పలికేందుకు కార్యకర్తలు సంసిద్ధులవుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల, మతాలకతీతంగా అర్హులైన అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేయడంతోపాటు అన్ని సామాజికవర్గాలకూ రాజకీయంగా ప్రాధాన్యమిచ్చింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి పాటుపడుతోంది. దీనివల్ల సామాజిక సాధికారత సాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తోంది.

బస్సు యాత్ర సాగుతుందిలా..

- ఉదయం 10 గంటలకు కె.కోటపాడులో అతిథులకు బైక్ ర్యాలీతో స్వాగతం
- 10.45 నుంచి 11.15 గంటల వరకు మీడియా సమావేశంలో మాట్లాడనున్న మంత్రులు
- 11.15 నుంచి 11.30 గంటలకు పదిహేను నిమిషాలపాటు బైక్ ర్యాలీ
- 11.30 నుంచి 11.45 గంటల వరకు కె.కోటపాడు ప్రభుత్వ హాస్పటల్ సందర్శన
- 11.45 నుంచి 12 గంటల వరకు ఎ.కోడూరు ప్రభుత్వ పాఠశాలలో నాడు - నేడు పనుల పరిశీలన
- 1 గంట నుంచి 2 గంటల వరకు దేవరాపల్లి మండలం వాకపల్లి చందన్ వ్యాలీ వద్ద లంచ్
- మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి యాత్రగా మాడుగుల ఘాట్ రోడ్ వద్దకు రాక
- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బహిరంగ సభ

విజయవంతం చేయాలి

కశింకోట: మాడుగుల నియోజకవర్గంలో గురువారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధి



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బొడ్డేడ ప్రసాద్, దిలీప్‌కుమార్



జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకం ఎగురవేసిన ఎస్పీ మురళీకృష్ణ

- రాష్ట్రం మహనీయుల త్యాగఫలం
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగా జిల్లా అభివృద్ధికి అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి జి.రామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్, గ్రామవార్డు సచివాలయ అధికారి మంజులావాణి పాల్గొన్నారు.

జాతీయ పతాకం ఎగరేసిన ఎస్పీ

భాషా ప్రతిపాదికన రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితమే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం అని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపు నాయుడు, సతీష్, వెంకటరావు, ఎస్‌ఐలు రఘువర్మ, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, ఢిల్లేశ్వరరావు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో..

అనకాపల్లి టౌన్: స్థానిక కన్యకాపరమేశ్వరి మెయిన్ రోడ్డు వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

మరో అంతర్జాతీయ సదస్సుకు

విశాఖ ముస్తాబు



- నేటి నుంచి 8వ తేదీ వరకు ఐసీఐడీ కాంగ్రెస్ ప్లీనరీ
- 57 ఏళ్ల తరువాత భారత్‌లో నిర్వహణ
- 74 దేశాల నుంచి 1,200 మంది ప్రతినిధులు రాక
- 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భద్రతా చర్యలు

నేడు సీఎం జగన్ విశాఖ రాక



మహారాణిపేట : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 8.05 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 8.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో మధురవాడ ఐటీ హిల్ నెంబర్.3లో ఉన్న హెలిప్యాడ్‌కి 9.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా రుషికొండలోని రాడిషన్ బ్లూ రిసార్ట్‌కు వెళ్తారు. అక్కడ జరగనున్న 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్(ఐసీఐడీ) కాంగ్రెస్ ప్లీనరీలో 9.30 గంటల నుంచి 11 గంటల వరకు పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గంలో మధురవాడ హెలిప్యాడ్‌కు 11.15 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 11.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 11.45 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

దొండపర్తి : మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖ సిద్ధమైంది. అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన ఐసీఐడీ కాంగ్రెస్ ప్లీనరీకి వేదికవుతోంది. 74 దేశాల అంబాసిడర్లు, మంత్రులు, ఇతర ప్రతినిధులకు అతిథ్యమిస్తోంది. ఇప్పటికే జీఐఎస్, జీ20 సదస్సులతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన విశాఖలో గురువారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సదస్సు జరగనుంది. 57 ఏళ్ల తరువాత భారత్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు విశాఖ వేదిక వడం విశేషం. సెంట్రల్ వాటర్ కమిషన్, ఏపీ జల వనరుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న ఈ సదస్సును గురువారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 'వ్యవసాయం నీటి కొరతను అధిగమించడం' అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్, ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో పాటు భారత్ నుంచి 300 మంది హాజరుకానున్నారు. అలాగే ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, చైనా, ఇండోనేషియా, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జపాన్, కొరియా, మలేషియా, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం ఇలా 74 దేశాల నుంచి 900 మందికి పైగా ప్రతినిధులు రానున్నారు. ఇదే వేదికపై 74వ అంతర్జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఐఈసీ) సదస్సు కూడా జరగనుంది. 1100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

తొలి రోజు ఇలా..

- గురువారం ఉదయం 9.30 గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది.
- 9.35కు కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి దేబాశ్రీముఖర్జీ ప్రారంభోపన్యాసం చేస్తారు.
- 9.45కు ఐసీఐడీ అధ్యక్షుడు డాక్టర్ రాగబ్ సదస్సు విశేషాలను వివరిస్తారు.
- 9.55కు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు.
- 10.15కు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడతారు.
- 10.40కు ఐసీఐడీ చేసిన పబ్లికేషన్స్‌ను విడుదల చేస్తారు.
- 10.45కు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా వరల్డ్ హెరిటేజ్ ఇరిగేషన్ స్ట్రక్చర్ అవార్డులను అందజేస్తారు.
- 10.55కు ఐసీఐడీ ఉపాధ్యక్షుడు కుష్వీందర్ ఓహ్రా వందన సమర్పణ చేస్తారు.

బొగ్గు బట్టీలపై దాడులు



బొగ్గు బట్టీ వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

యలమంచిలి (అనకాపల్లి రూరల్): పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా విలువైన వృక్ష సంపదను బుగ్గి చేసి, బొగ్గుగా మార్చుతున్న వైనంపై అటవీ శాఖాధికారులు స్పందించారు. బుధవారం సాక్షిలో 'బొ(గ్గు)క్కేస్తున్నారు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో.. తక్షణమే ఈ వ్యవహారంపై తనిఖీలు జరిపి నివేదిక ఇవ్వాలని యలమంచిలి అటవీ రేంజ్ అధికారి జి.అనిల్‌కుమార్‌ను డివిజినల్ ఫారెస్ట్ అధికారి రాజారావు ఆదేశించారు. అనిల్‌కుమార్ ఆదేశాలతో ఎఫ్ఎస్‌వో బీవీ రమణ, బీట్ ఆఫీసర్లు షేక్ మదీనా, వేణుకుమారి, సిబ్బంది పెదపల్లి వెళ్లి అనధికారికంగా నిర్వహిస్తున్న బొగ్గు బట్టీలను పరిశీలించారు. అక్కడ నిల్వ ఉంచిన కలప, పెద్ద పెద్ద దుంగలను గమనించి, కలప ఎక్కడి నుంచి తెస్తున్నారని నిర్వాహకులను అడిగారు. అక్కడ మర్రి, సుబాబుల్, జీడి మామిడి తదితర రకాల కలప ఉన్నట్టు గుర్తించారు. అటవీ ప్రాంతంలో చెట్లు నరికి, వృక్షాలను కాల్చి బొగ్గు తయారు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని నిర్వాహకులను హెచ్చరించారు. అయితే బొగ్గు బట్టీలకు తరలివెళ్తున్న కలప పెదపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించినది కాదని తమ విచారణలో తేలిందని యలమంచిలి అటవీ రేంజ్ అధికారి అనిల్‌కుమార్, ఎఫ్ఎస్‌వో బీవీ రమణ తెలిపారు. మొత్తానికి సాక్షి కథనంతో బొగ్గు బట్టీల నిర్వాహకుల్లో గుబులు రేగింది.

సింహాద్రి ట్రైన్‌కు సాంకేతిక సమస్య

నక్కపల్లి : గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్తున్న సింహాద్రి ట్రైన్‌కు బుధవారం సాయంత్రం సాంకేతిక సమస్య ఏర్పడింది. నర్సీపట్నం రోడ్డు-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో రైలుకు బ్రేకులు ఒక్కసారిగా పట్టేసాయి. రైలు నిలిచిపోయి చివర బోగీల నుంచి పొగలు వచ్చాయి. దీంతో ప్రయాణికులు భయపడ్డారు. ట్రైన్ సిబ్బంది వెంటనే సమస్యను సరిచేశారు. తర్వాత రైలు బయలుదేరింది. బ్రేకులు పట్టేయడం వల్ల రైలు నిలిచిపోయిందని, చక్రాల నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు భయందోళనలు చెందారని తుని రైల్వే ఎస్ఐ మారూఫ్ తెలిపారు.

ఆకట్టుకున్న కళాకృతులు



కాగితంతో ఫ్లవర్



మట్టితో శివలింగం

నర్సీపట్నం: బాలల ప్రతిభా పాటవాలను వెలికి తీసేలా బుధవారం జిల్లాస్థాయి కళాకృతుల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మట్టి, కాగితంతో చిన్నారులు తయారు చేసిన పుష్పాలు, జంతువుల బొమ్మలు ఆకట్టుకున్నాయి. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ పేర్కొన్నారు. 14వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై సంబరాలా?

అనకాపల్లిటౌన్: టీడీపీ అధినేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ రావడంపై ఆ పార్టీ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో వారికే తెలియాలని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావు బాధ్యతల స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు కంటి ఆపరేషన్ చేయించుకోవడం కోసం మాత్రమే బెయిల్ ఇచ్చారని చెప్పారు. స్కిల్‌డెవలప్‌మెంట్ స్కీంలో రూ.371 కోట్లు ప్రజాధనాన్ని కాజేశాడు కాబట్టే బాబును జైల్లో ఉంచారని వ్యాఖ్యానించారు. ప్రజాధనం కాజేసిన బాబు తన శేషజీవితం ఇక జైలులోనే గడపాల్సి ఉంటుందన్నారు.

బెల్లం మార్కెట్ పూర్వ వైభవానికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి తెలిపారు. అప్పట్లో 40 నుంచి 50 లక్షల వరకు బెల్లం దిమ్మలు వచ్చేవని, గత ఏడాది 12 లక్షలు మాత్రమే వచ్చాయన్నారు. క్రమేపీ చెరకు దిగుబడి తగ్గడంతోఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మార్కెట్‌లో పని చేస్తున్న కళాసీలు, కార్మికులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ యువత పరిశ్రమలపైనే కాకుండా వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టకాలంలో పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభించిందన్నారు. చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని పెంచుకునేలా పని చేస్తానన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వరాహ సత్యవతి, ఎంపీపీలు సూరిబాబు, కలగా లక్ష్మి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు విష్ణుమూర్తి, కశింకోట జెడ్పీటీసీ శ్రీధర్‌రాజు, మాజీ జెడ్పీటీసీ ధనమ్మ, ఆలయాల చైర్మన్లు మురళీకృష్ణ, నాయుడు, నాగేశ్వరరావు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు రత్నకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు.



చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావును అభినందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

7 నుంచి ఈవీఎంల తనిఖీ

తుమ్మపాల: ఈ నెల 7, 8, 9, 10 తేదీల్లో ఈవీఎంలు, వివి పాట్‌ల ఫస్ట్ లెవెల్ తనిఖీ జరుగుతుందని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక హాజరుకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించి, జాబితాను సిద్ధం చేసి పంపించాలని చెప్పారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక శిబిరాల్లో బూత్ స్థాయి అధికారి వద్ద ఉన్న ఓటర్ల జాబితాలో పేర్లు సరిచూసుకోవాలన్నారు. అక్టోబర్ 25 నుంచి 31వ తేదీ వరకు మార్పులు, చేర్పులకు సంబంధించి మొత్తం 1249 దరఖాస్తులు అందాయన్నారు. 4865 బ్యాలెట్ యూనిట్లు, 2912 కంట్రోలింగ్ యూనిట్లు, 3114 వివి పాట్‌లను భెల్ ఇంజనీర్లు ఓకే చేశారని చెప్పారు.

క్లుప్తంగా

నేడు మరిడిమాంబ జాతర



అనకాపల్లి రూరల్: మండలంలోని పిసినికాడ గ్రామంలో గురువారం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా విజయదశమి తరువాత వచ్చే రెండో గురువారం ఈ గ్రామంలో మరిడిమాంబ అమ్మవారికి జాతర జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవారి ఆలయం నుంచి గ్రామ ముఖద్వారం వరకు భారీగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. జాతరను పురస్కరించుకుని గ్రామానికి పెద్ద సంఖ్యలో బంధు, మిత్రులు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పూర్తి చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం అరుంధతీనగర్ యూపీహెచ్‌సీ, సచివాలయం పరిధిలో శాంతినగర్, మండలంలోని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఆవరణలో గురువారం గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, ఎంపీడీవో కె.నర్సింహరావులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని టోకెన్లు పొందిన వారితో పాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా శిబిరంలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరాలకు ప్రత్యేక వైద్య నిపుణులు హాజరై, రోగులను పరీక్షించి, అవసరమైన మందులు ఉచితంగా అందిస్తారన్నారు.

కార్తీకమాస ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతిలు చెప్పారు. పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం కార్తీకమాసోత్సవాల గోడపత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల పాటు శివార్చనలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు గడువు పెంపు

అనకాపల్లిటౌన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం 2023–24 విద్యాసంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్ కోర్సులలో దరఖాస్తు చేసుకునేందుకు అపరాధ రుసుం లేకుండా 3వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు నమోదుచేసుకుని, దగ్గర్లోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించి, ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని కోరారు.

ఈ ఏడాది మార్చి–ఏప్రిల్‌లో టెన్త్ పరీక్షలకు హాజరగు రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులు అపరాధ రుసుం రూ.50తో ఈ నెల 11 వరకు, 17 నుంచి రూ.200లు, 23 నుంచి 30 వరకు రూ.500లు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. దరఖాస్తుల్ని www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో అప్‌లోడ్ చేసి, ఫీజును సీఎఫ్‌ఎంఎస్‌లో బ్యాంక్ చలానా ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 415 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సంబరాలు హాస్యాస్పదం

- కంటి ఆపరేషన్‌కే బెయిల్ మంజూరు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: చంద్రబాబునాయుడు తన రాజకీయంతో కోర్టును కూడా తప్పుపట్టేలా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఉడ్‌పేటలోని పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ స్కాం కేసులో కంటి సమస్యతో బాధపడుతున్నానంటూ మొరపెట్టుకుంటే హైకోర్టు 28 రోజుల షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిందన్నారు. శస్త్రచికిత్స చేయించుకుని నవంబరు 28న రాజమండ్రి కేంద్ర కారాగారంలో లొంగిపోవాలని ఆదేశిస్తే, టీడీపీ సంబరాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు రూ.371 కోట్లు స్వాహా చేసి అడ్డంగా దొరికారని, జైలుశిక్ష అనుభవించక తప్పదన్నారు. ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ స్కిల్ స్కాంతో పాటు ఇన్నర్ రింగ్‌రోడ్డు, మద్యం కుంభకోణాల్లో చంద్రబాబుకు జైలు శిక్ష తప్పదన్నారు.

సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన



బస్సుయాత్ర సభా ప్రాంగణంలో పార్టీ నేతలకు సూచనలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 9న జరిగే సామాజిక సాధికార బస్సుయాత్ర ఏర్పాట్లను ఎంపీ బీవీ సత్యవతితో కలిసి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే బస్సుయాత్రను, సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలను కోరారు. ఆరోజు జరిగే సభకు వేలాదిమంది జనం వచ్చే అవకాశం ఉన్నందున, స్టేడియంలో ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా చూడాలని పార్టీ నేతలకు సూచించారు. ఆయన వెంట పార్టీ నేతలు, జీవీఎంసీ అధికారులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పట్టణంలోని గవరపాలెం అరుంధతీనగర్ సచివాలయ పరిధిలో బుధవారం 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నేటితో 11 వేలకు పైగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. వీటి ద్వారా లక్షల మంది రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిచారని పేర్కొన్నారు. తమ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా మందిలో ప్రమాదకర రోగాలను ముందస్తుగా తెలుసుకుని, అవసరమైన చికిత్స పొంది, ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటున్నారని తెలిపారు.

వ్యాధి తీవ్రత ఆధారంగా అవసరమైన వారికి ఆరోగ్య శ్రీలో కార్పొరేట్, జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేసి, మరీ చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీలా శ్యామ్, దాడి ఈశ్వరరావు, శిలపరశెట్టి బాబీ, కోరుమిల్లి అరుద్ర, సూరిశెట్టి శివాజీ, కాండ్రేగుల సాంబశివరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాష పూర్వ వైభవానికి కృషి



తెలుగు భాష ప్రాముఖ్యతను వివరిస్తున్న రామ్మోహన్‌రావు

తుమ్మపాల: రోజురోజుకూ నిరాదరణకు గురవుతున్న తెలుగు భాష పరిరక్షణకు అందరూ చేయూతనివ్వాలని తెలుగు భాష పరిరక్షణ సమితి సమన్వయకర్త కె.రామ్మోహన్‌రావు కోరారు. పట్టణంలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 'తెలుగుకు వెలుగునిద్దాం'39వ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోజుకు కనీసం అరగంట సమయం తెలుగు పుస్తకాలు చదివేందుకు కేటాయించాలని అందుకు తల్లిదండ్రులు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. పద్యకవి శిష్టా తమ్మిరాజు మాట్లాడుతూ పద్యం తెలుగువాడి ఆస్తి అని, తెలుగు పద్యం సొగసు, దాని ప్రాముఖ్యతను వివరించారు. ప్రముఖ కవి, రచయిత మాధవి సనారా మాట్లాడుతూ చిన్న చిన్న పదాలతో కవితలు రాయవచ్చని, అవి తెలుగు భాష మాధుర్యాన్ని తెలియజేస్తాయన్నారు. విద్యార్థులకు తెలుగు కవితలు రాయడంపై అవగాహన కల్పించారు. బాల్యంలోనే తెలుగుకు పటిష్ట పునాది వేయాలని, దీనికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి చాలా అవసరమని ప్రముఖ రచయిత్రి అమరజ్యోతి అన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఎస్ఎస్ రామ్‌కుమార్, బి.విశ్వేశ్వరరావు, నేతాజీ, కృష్ణంరాజు నాయుడు పాల్గొన్నారు.

'అమరజీవి' పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే ఆంధ్రరాష్ట్ర అవతరణ అని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మొయిన్‌రోడ్డు వద్దనున్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్రోద్యమ అనంతరం తమిళనాడులో ఉన్న తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని కేంద్రాన్ని కోరినా ఇవ్వకపోవడంతో, నిరవధిక నిరాహార దీక్ష చేపట్టి తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన మరణంతో అప్పటి ప్రధాని నెహ్రూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేశారన్నారు. దీక్షలో ఆయన మృతి తర్వాత జరిగిన ఆందోళనల్లో అనకాపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు ఉద్యమకారులు మరణించిన విషయాన్ని గుర్తు చేశారు. గాంధీతో కలిసి ఆయన దేశ స్వాతంత్ర్యానికి కృషి చేశారన్నారు. పట్టణ వాసుల మరణం రాష్ట్ర అవతరణలో మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. యువత ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర అభివృద్ధికి నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమా భాస్కర్, శిలపరశెట్టి బాబీ, కొత్తా గోపాలకృష్ణ, మాధురీనాయుడు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహారంతో ఆరోగ్యం



వైద్యురాలు హరితకుమారిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించేందుకు పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ గౌరీపతి సూచించారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో అసోసియేషన్, సెవెన్‌హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్డియాలజిస్ట్ హరితకుమారి, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ దిలీప్‌మహారాజ్‌లు 110 మంది రోగులను పరీక్షించి, వైద్యసేవలందించారు. రోగులకు అవసరమైన రక్తపరీక్షలు జరిపి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు ఎంవీవీ స్వామి, ఎస్.తమ్మిరాజు, నల్లల దేముళ్లు, బీఎల్ఎన్ శర్మ, కుండల రామకృష్ణ, మహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ



నరసింగబిల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కశింకోట: అసమానతలు లేని అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ నెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మండలంలోని నరసింగబిల్లిలో ప్రజా రక్షణ భేరి వాల్ పోస్టర్‌ను భవన నిర్మాణ కార్మికులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో భవన నిర్మాణ కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి అందాల్సిన పథకాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, భవన నిర్మాణ కార్మిక యూనియన్ ప్రతినిధులు లోకేష్, మానేరావు, రాంబాబు, రమణ, తగ్రపోలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అయ్యప్ప మండల దీక్ష



శ్రీగౌరీ రైతు సంఘం అయ్యప్ప ఆశ్రమంలో మండల దీక్ష ప్రారంభం

తుమ్మపాల: ఆధ్యాత్మికతకు పేరొందిన గవరపాలెం శ్రీగౌరీ రైతు సంఘం అయ్యప్ప ఆశ్రమంలో బుధవారం అయ్యప్ప మండల దీక్షలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు అంగరంగ వైభవంగా అయ్యప్ప మాలధారణ భక్తులు వివిధ ఫల దినుసులతో అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప పాటలతో శరణు ఘోష మోగించారు. ప్రధాన గురుస్వాములు మళ్ల నరసింగరావు, కొణతాల పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో కన్నె స్వాములకు పూజా విధానంపై అవగాహన కల్పించారు. 18 మంది గురుస్వాములు పూజలు చేస్తూ, 41 రోజులు దీక్ష చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్వాములు కాండ్రేగుల సీతారాం బాబ్జి, పీలా రాముడు, మళ్ల సురేంద్ర, మళ్ల సూరిబాబు, అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

భీమునిగుమ్మం హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు



విద్యార్థుల నోట్‌పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లిటౌన్: స్థానిక జీవీఎంసీ భీమునిగుమ్మం హైస్కూల్లో 6, 9, 10 తరగతుల విద్యార్థులకు హిందీ సబ్జెక్టుల నోట్‌పుస్తకాలను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ బుధవారం పరిశీలించారు. వాటిని సంబంధిత ఉపాధ్యాయులు దిద్దకపోవడాన్ని గుర్తించారు. దీనికి హెచ్‌ఎం పర్యవేక్షణ లోపమే కారణమని తెలుసుకుని షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈవో తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ పునరుద్ధరణకు వినతి

కశింకోట: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు న్యాయం చేయాలని దళిత బహుజన గ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు, ఏపీ దళిత వేదిక అనుబంధ రాజ్యాధికార వేదిక కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు కోరారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లిలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి టి.అజయ్‌బాబుకు వినతి పత్రాన్ని అందించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి బెస్ట్ అవైలబుల్ స్కూలు పథకం ఉండేదని, ఈ పథకం పునరుద్ధరణకు న్యాయ పోరాటం చేయగా, కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉత్తర్వులు అమలుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆ వినతి పత్రంలో కోరారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు



అఫీషియల్ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

కశింకోట: కశింకోట పంచాయతీ పరిధిలో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక పోలీస్ క్వార్టర్స్ ఎదుటనున్న అఫీషియల్ కాలనీలో డ్రైనేజీని నిర్మిస్తున్నారు. కోమటి వీధి మర్రిచెట్టు వద్ద కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చిన నిధులతో వీటిని నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికి ఆరు కిలోమీటర్ల మేర డ్రైనేజీ పూర్తయిందన్నారు. మరో కిలో మీటర్ మేర డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ బాలల ఉత్సవానికి జెనిత్



కశింకోట: జాతీయ బాలల ఉత్సవానికి అనకాపల్లికి చెందిన బాల నృత్య కళాకారుడు జెనిత్ సంఘవి ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి న్యూఢిల్లీలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న ఉత్సవానికి రాష్ట్ర బృందం తరపున హాజరు కానున్నారు. విశాఖలోని కొరియోగ్రాఫర్ నాగరాజు పట్నాయక్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. అతి చిన్న వయస్సులోనే 8 రాష్ట్రాలకు చెందిన జానపద నృత్యాలను జెనిత్ అవలీలగా ప్రదర్శిస్తాడు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల ధర్నా



అనకాపల్లి డీపీటీవో కార్యాలయం వద్ద ఆర్టీసీ కార్మికుల ధర్నా

కశింకోట: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) విజయనగరం జోన్–1లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి డీపీటీవో కార్యాలయం వద్ద కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయుఏ) అధ్యక్షుడు ఆర్.ఎస్.రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 200 మంది కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జి.రామారావు మాట్లాడుతూ ఆర్టీసీ జోనల్ యాజమాన్యం తక్షణమే చొరవ తీసుకొని 2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా ఇచ్చిన బదిలీలను రద్దు చేసి, వారిని వెనక్కి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. జోనల్ యాజమాన్యం తక్షణమే సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోనల్ సంయుక్త కార్యదర్శి జి.శంకరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.ఎస్.కుమార్, అసిస్టెంట్ కార్యదర్శి బోశం రమణ, రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్, ఎ.జయలక్ష్మి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో బుధవారం ఉచితంగా 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఆస్పత్రి ఆవరణలో 33 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదురోజులు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్యసహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

